# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



## జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

సోమవారం 17 ఫిబ్రవరి 2025



### అందరి చూపు.. ఉమ్మడి జిల్లా వైపు..



- పట్టభద్రుల ఎన్నికల్లో 45 శాతం ఓట్లు ఇక్కడివే
- ప్రత్యేక దృష్టి పెట్టిన అభ్యర్థులు 6
- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

### ఎండిపోతున్న మొక్కలు

- లక్షల ప్రజాధనం వృథా
- చెట్లను నరికినా పట్టించుకోని అధికారులు 8

- గొల్లపల్లి (ఆంధ్రజ్యోతి)

### ఘనంగా సంకష్టహర చతుర్థి పూజలు

- ధర్మపురిలోని గణపతి ఆలయంలో భక్తుల మొక్కులు

ధర్మపురి (ఆంధ్రజ్యోతి)

7




# పరీక్షలకు వేళాయె

- మార్చి, ఏప్రిల్ నెలల్లో వివిధ తరగతుల పబ్లిక్ పరీక్షలు
- పదోతరగతి నుంచి డిగ్రీ, పీజీ ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు
- ప్రైవేటు యాజమాన్యాల ఒత్తిళ్లతో విద్యార్థుల్లో టెన్షన్

జగిత్యాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పరీక్షల సీజన్ వచ్చేసింది. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను పరీక్షల ఫీవర్ వెంటాడుతోంది. మంచి మార్కుల సాధనకు విద్యార్థులు.. వారికి కావాల్సిన వసతుల కల్పనలో తల్లిదండ్రులు నిమగ్నమయ్యారు. పదో తరగతి ఇంటర్‌మీడియట్, ఓపెన్‌స్కూల్, డిగ్రీ, వివిధ పీజీ ప్రవేశపరీక్షలు మార్చి నెలలో ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షల కోసం జిల్లాలో దాదాపు 70 వేల మంది పైబడి విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. పరీక్షల్లో అధిక మార్కులు సాధించాలన్న ఒత్తిడిలో విద్యార్థులు ఉండగా.. ఇన్నాళ్ల చదివింది ఒకెత్తు ..ఈ పరీక్షలు ఒకెత్తూ...తమ పిల్లలు మంచి మార్కులు సాధించి పోటీ పరీక్షల్లో విజయం సాధించాలన్న ఆకాంక్ష తల్లిదండ్రుల్లో ఉంది. మరోవైపు విద్యార్థుల్లో అధిక మందికి మొబైల్ ఫోన్ వ్యసనంగా మారింది. పరీక్షల సమయంలో సోషల్ మీడియా కబుర్లతో కాల క్షేపం చేస్తే ఆ ప్రభావం పరీక్షలపై పడుతుందన్న సైకాలజిస్టుల హెచ్చరికలు తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇంటికి దూరం ఉంటూ పరీక్షల కోసం సన్నద్ధమవుతున్న విద్యార్థుల విషయంలో మరింత ఎక్కువగా ఆలోచిస్తున్నారు. మరోవైపు పలువురు ప్రైవేటు యాజయాన్యాలు విద్యార్థులపై చదువు ఒత్తిడి పెంచుతున్నాయి. చదువులో ప్రతిభ చూపేవారిని మరింత రుద్దుతున్నారు. తమ కళాశాలకు పేరు రావాలన్న లక్ష్యంతో సామార్థ్యాలకు మించి ఒత్తిడి పెంచుతున్నారు. చదువులో ప్రతిభ చూపేవారిపై మరింత ఒత్తిడి తెస్తున్నారు. ఇది విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందన్న వైద్యుల హెచ్చరికలు అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులను కలవర పెడుతున్నాయి.

**● పరీక్షల సీజన్...**

మార్చి 5వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నారు. మార్చి 25వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు పూర్తి చేయడానికి అనుగుణంగా ఇంటర్ బోర్డు షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 21వతేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరపడానికి అనుగుణంగా ఎస్సెస్సీ బోర్డు షెడ్యూల్ విడుదల చేసింది. పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలకు సుమారు 40వేల మంది విద్యార్థులు, పదో తరగతి పరీక్షలకు సుమారు 30వేల మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ఇంటర్,

మిగతా 8లో

## కేసీఆర్ హయాంలో తెలంగాణ సస్యశ్యామలం

**- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్**

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను సస్యశ్యామల రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కొనియాడారు. కేసీఆర్ పుట్టినరోజు వేడుకలో భాగంగా ముందస్తుగా ఆదివారం మండలంలోని రాజేశ్వర్‌రావుపేట గ్రామ శివారులోని పంపు హౌస్ వద్ద రైతులు, నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి రాష్ట్రంలోని వ్యసాయానికి సాగునీరు అందించి సాగు విస్తీర్ణం పెంచి రైతుల కుటుంబాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. రైతు బంధు, బీమా ప్రవేశపెట్టి రైతులకు అండగా నిలిచి ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులను గురి చేస్తూ ఆత్మహత్యలు చేసుకునే విధంగా పాలన కొనసాగిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

**కేసీఆర్ పాలన ఓ స్వర్ణయుగం**

కథలాపూర్ (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ పదేళ్ల పాలన ఓ స్వర్ణయుగం అని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పుట్టిన రోజు పురస్కరించుకుని మండలంలోని భూషణరావుపేట సింగిల్‌విండో కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరిట మోసపూరిత హామీలిచ్చి వాటిని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రుణమాఫీ, రైతుభరోసా, ఎరువులు సకాలంలో అందక రైతాంగం ఇబ్బందులు పడుతోందన్నారు. రాబోయే కాలంలో బీఆర్ఎస్ అధికారంలో కి రావడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ తీట్ల శంకర్, రైతు సమన్వయసమితి గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు బద్దం మహేందర్‌రెడ్డి, జనార్దన్, శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు పట్టుదలతో చదివాలి



విద్యార్థికి మెమెంటో అందిస్తున్న సీఐ

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని యామపూర్ గ్రామానికి చెందిన ఎలేటి రక్షిత్ జేఈఈ మెయిన్ ఫలితాల్లో 98.08 శాతం సాధించిన సందర్భంగా శాలువతో సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రక్షిత్ జేఈఈ మెయిన్స్‌లో విజయం సాధించడం అభినందనీయమన్నారు. గ్రామ యువత రక్షిత్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి కష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలన్నారు. యువత పట్టుదలతో శ్రమిస్తే ఏదైనా సాధ్యమని వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వీవీ రావు విగ్రహం ఏర్పాటు చేయాలి

మల్లాపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఆధారిత పరిశ్రమను ముత్యంపేటలో నెలకొల్పడం కోసం విశేష కృషిచేసిన దివంగత మాజీ మంత్రి వర్ధినేని వెంకటేశ్వరరావు (వీవీ రావు) విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని చెరుకు రైతు నాయకులు సిర్పూర్ లింగారెడ్డి కోరారు. ఆదివారం కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ సేవాదళ్ నాయకుడు నాసర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ముత్యంపేటలోని మూసివేతకు గురియైన చక్కెర కర్మాగారాన్ని రాష్ట్ర ప్రభుత్వం తెరిపించనున్న నేపథ్యంలో వర్ధినేని వెంకటేశ్వర్‌రావు విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## దుబాయ్‌లో వర్క్ పర్మిట్ రాలేదని మనస్తాపంతో ఆత్మహత్య



రాములు (ఫైల్)

మేడిపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దుబాయ్ దేశంలో వర్క్ పర్మిట్ రాలేదని మనస్తాపంతో తునికి రాములు (42)అనే వ్యక్తి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మేడిపల్లి గ్రామానికి చెందిన తునికి రాములు గత సంవత్సరం నవంబరు నెలలో ఉపాధినిమిత్తం దుబాయ్ వెళ్లాడు. వర్క్ పర్మిట్ వీసా రాకపోవడంతో తీవ్రమనస్తాపానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా ఆదివారం స్వగ్రామానికి వచ్చాడు. మండల కేంద్రలోని కస్తూర్బాగాంధీ పాఠశాల వెనుక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు రాములు భార్య శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

## తల్లి, ఇద్దరు చిన్నారుల మృతితో మద్దులపల్లిలో విషాదం



చిన్నారుల మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

పెగడపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు, మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడాన్ని భరించలేక హారిక(30) అనే మహిళ తన ఇద్దరు పిల్లలకు పురుగుల మందు తాగించి తానూ తాగి ఆత్మహత్యకు పాల్పడగా మద్దులపల్లిలో విషాదం నెలకొంది. హారిక తల్లిదండ్రులు, బంధువులు చిన్నారుల మృతదేహాలను ఇంటిలోనే గొయ్యి తవ్వి పూడ్చిపెడతామని, ముగ్గురు మృతికి కారణమైన తిరుపతిని తమకు అప్పగించాలని ఆందోళన చేశారు. దీంతో మద్దులపల్లి గ్రామంలో ఆదివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో మల్యాల సీఐ నీలం రవి ఆధ్వర్యంలో పెగడపల్లి, కొడిమ్యాల ఎస్ఐలు రవికిరణ్, సందీప్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కేసు విచారణ చేసి చట్టం ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సీఐ రవి తెలపడంతో శాంతించి, అంత్యక్రియలకు సహకరించారు.

**● నిందితులను కఠినంగా శిక్షించాలి**

మండలంలోని మద్దులపల్లిలో తల్లి, ఇద్దరు పిల్లల మృతికి కారకులను గుర్తించి కఠినంగా శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని పోలీసులను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. మద్దులపల్లిలో బాధిత కుటంబాన్ని లక్ష్మణ్‌కుమార్ పరామర్శించి సంతాపం తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ఆందోళన చేస్తున్న హారిక తల్లిదండ్రులకు కుటుంబసభ్యులకు పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఆత్మహత్యకు కారకులకు కఠినంగా శిక్ష పడేలా కేసు నమోదు చేయాలని సీఐ రవికి సూచించారు.

## బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల కోరుట్ల అసెంబ్లీ కన్వీనర్ దొనికెల నవీన్ కోరారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో విద్యార్థులు, నిరుద్యోగులు, పట్టభద్రులు, ఉద్యోగుల సమస్యలపై స్పందించి పోరాడేది బీజేపీ పార్టీయే అన్నారు. అందరి సమస్యలపై నిత్యం అందుబాటులో ఉండేది పోరాటం చేసేది బీజేపీ పార్టీ అని తెలిపారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ పట్టభద్రుల, టీచర్స్ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్యకు మొదటి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలని కోరారు.

**కోరుట్ల రూరల్ (ఆంధ్రజ్యోతి):** మండంలోని యూసుఫ్‌నగర్ గ్రామంలో బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మద్దతుగా ఆదివారం ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ తుక్కారాం గౌడ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు యువకులను కలిసి బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భూమానందం, నాగరాజు, తుక్కయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వరదకాలువ మట్టి కనుమరుగు

- అనుమతులకు మించి తరలిస్తున్నారని ఆరోపణలు
- సొమ్ము చేసుకున్నంటున్న వ్యాపారులు

మల్యాల, ఫిబ్రవరి 16 (ఆంధ్ర జ్యోతి): వరదకాలువ గట్లు కనుమరుగు అవుతున్నాయి. కాలువ పక్కన గల మట్టి గుట్టలు, అందులోని బండలు అక్రమార్కుల పాలు అవుతున్నాయి. ఆదాయం రాబడి పేరుతో అధికారులు ఛోద్యం చూస్తుండడంతో మట్టి గుట్టలు మాయం అవుతున్నాయి. నిబంధనలు విస్మరించి వ్యాపారులు మట్టిని తరలిస్తున్నప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో వరదకాలువ గట్లు మరికొన్ని రోజుల్లో ప్రమాదకరంగా మారే అవకాశాలు ఉన్నాయి. మల్యాల మండలంలో రాంపూర్ నుంచి బల్వంతాపూర్ వరకు దాదాపుగా 14కిలోమీటర్ల మేర వరదకాలువ విస్తరించి ఉంది. అయితే వరదకాలువ తవ్వకంతో ఏర్పడిన గుట్టల లాంటి మట్టి కుప్పలను అక్రమార్కులు దర్జాగా ఖాళీ చేస్తున్నారు. రాంపూర్, నూకపల్లి, మల్యాల క్రాస్ రోడ్డు, ముత్యంపేట తదితర ప్రాంతాల్లో మట్టి తరలింపు జోరుగా సాగుతోంది. ఇక్కడి నుంచి నూతన ఇళ్ల నిర్మాణాలు ఇతరాత్ర కోసం జగిత్యాల పట్టణం తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఏళ్లుగా సాగుతున్న ఈ వ్యవహారం తో కాలువ మట్టి గట్లు కనుమరుగై ఆనవాళ్లు కోల్పోతు న్నాయి. వరదకాలువకు బండరాళ్లు కూడా పెద్దమొత్తంలో ఉండడంతో సహజసంపద అయిన దాన్నీ తరలిస్తున్నారు. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



వెలవెలబోతున్న మట్టి కుప్పలు



మట్టి తరలించడంతో ఏర్పడిన మైదానం

**● గోరంత అనుమతి.. కొండంత దోపిడీ..**

వరదకాలువ మట్టి, బండ తరలించడానికి గాను ఇరిగేషన్, మైనింగ్ అధికారుల అనుమతి తప్పనిసరి కాగా వ్యాపారులు కొంతమేర మాత్రమే అనుమతులు తీసుకొని అనుమతికి మించి రెండు నుంచి మూడు రెట్లు అధికంగా తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ నాయకుల అండదండలతో ఈ తతాంగం ఏళ్లుగా సాగుతున్నప్పటికీ నియంత్రణ కరువైందని పలువురు పేర్కొంటున్నారు. అధికారులు పకడ్బందీ చర్యలుతీసుకోవాలని కోరుతున్నారు.

**● అనుమతుల మేరకే మట్టి తరలింపు**

**తిరుపతి, డీఈ, ఇరిగేషన్**

వరదకాలువ మట్టిని ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతుల మేరకే తరలిస్తున్నారు. అక్రమంగా మట్టి తరలింపును నివారించడంతో పాటు తరలిపోకుండా నిత్యం తమ ఇరిగేషన్ సిబ్బంది వరదకాలువ ప్రాంతంలో పర్యవేక్షిస్తున్నారు. అక్రమంగా, అనుమతికి మించి మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటాం.

## గిరిజనుల అభివృద్ధికి ప్రాధాన్యం

**ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



లక్ష్మణ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

పెగడపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని మద్దులపల్లి, రాజారాంపల్లి, ఏడుమోటలపల్లి తండాలలో ఆదివారం సంత్‌సేవాలాల్ జయంతి వేడుకలలో లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా మద్దులపల్లి తండాలో సంత్‌సేవాలాల్ ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ పరంగా నిధులు కేటాయించాలని ఆ గ్రామ గిరిజనులు విప్ లక్ష్మణ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల గిరిజన నాయకులతో పాటు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## దావన్‌పల్లిలో భోగ్ బండార్



పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు

రాయికల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దావన్‌పల్లి గ్రామంలో ఆదివారం సేవాలాల్ జయంతి సందర్భంగా భోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సురేందర్ నాయక్ మాట్లాడుతూ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారాల ఐదవ ధర్మ గురువని, బంజారా సంస్కృతి వేధధారణ జీవన విధానాలతో పాటు యావత్ బంజారా జాతిని ఏకధాటికి తీసుకువచ్చిన మహానీయులని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పూజారి బానోత్ హంజారియా, కిషన్ నాయక్, ఉప సర్పంచ్ బిక్యా నాయక్, గ్రామ సేవాలాల్ ట్రస్ట్ సభ్యులు బానావత్ తిరుపతి నాయక్, హపావత్ గంగాధర్, రాజు, అంబాజీ, తిరుమల్, బలరాం, మాజీ సర్పంచ్ మల్లయ్య, వెంకటేష్, దేవేందర్, తిరుపతి, కొమురయ్య పాల్గొన్నారు.

## నేటి ప్రజావాణి రద్దు

జగిత్యాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఈనెల 17వ తేదీన జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేశామని కలెక్టర్ సత్యప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు వినతులు ఇవ్వడానికి కలెక్టరేట్‌కు రావొద్దని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున ప్రజావాణి రద్దు చేసినట్లు కలెక్టర్ సత్యప్రసాద్ ప్రకటించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతారం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఫీడర్ల మరమ్మత్తుల దృష్ట్యా సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు రామన్నపేట ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పోతారం, రాజారం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## నేడు లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం



బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి

బీర్‌పూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం సోమవారం సాయంత్రం జరగనుంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యం కోసం ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను ఎప్పటి కప్పుడు జగిత్యాల డీఎస్పీ, జగిత్యాల రూరల్ సీఐలు, బీర్‌పూర్ ఎస్సైలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. రథోత్సవ కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈవో శ్రీనివాస్ కోరారు.

## వైభవంగా చతుర్థి వేడుకలు

జగిత్యాలరూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొలాస సహస్రలింగాల దేవాలయంలో ఆదివారం ఉదయం ఘనంగా సంకట చతుర్థి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని గణనాథుడికి ఆలయ అర్చకుల వేదమంత్రాల మధ్య భక్తులు పంచామృత అభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు నలుమాసు గంగాధర్, ఆలయ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

**జగిత్యాల అర్బన్ (ఆంధ్రజ్యోతి):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మి గణేశ మందిరంలో సంకష్ట చతుర్థి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సంకష్ట ఉపవాస దీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు జనమంచి శంకరయ్య శర్మ, దేవాలయ కన్వీనర్ కోటగిరి శ్రవణ్ కుమార్, సేవా సంఘం కన్వీనర్ జిల్లా ప్రభాకర్, సేవా సంఘం కో-ఆర్డినేటర్ యాదగిరి మారుతి రావు, రామచంద్రం భక్తులు పాల్గొన్నారు.

## ఢిల్లీ రైల్వే స్టేషన్ మృతులకు నివాళి



నివాళర్పిస్తున్న భారత సురక్ష సమితి నాయకులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో మరణించిన వారికి భారత సురక్ష సమితి నాయకులు ఆదివారం నివాళులు అర్పించారు. తొక్కిసలాటలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని వారు ప్రార్థించారు. భారత సురక్ష సమితి నాయకులు ఏసీఎస్ రాజు, పుప్పాల సత్యనారాయణ, అక్కినపెల్లి కాశీనాథం, సింగం గంగాధర్, బాశెట్టి మారుతి, వేముల దేవారాజం, బండారి మల్లికార్జున్, పన్నాటి విఠల్, కొత్త కొండ బాలన్న పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ గేములకు యువకుడి బలి

● అప్పుల పాలై ఆత్మహత్య

శంకరపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేములకు బానిసైన ఓ వ్యక్తి అప్పులపాలై మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ఏడిగ మధు(33) ఆన్‌లైన్, బెట్టింగ్ గేమ్స్ ఆడి అప్పులు పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం లేక మనస్థాపంతో ఈనెల 10న తన ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి భార్య గీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

## పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

శంకరపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామంలో ముప్పిడి రాంరెడ్డి(72) అనే వృద్ధుడు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్ గ్రామానికి చెందిన రాంరెడ్డి ఈనెల 15న రాత్రి మెట్‌పల్లి గ్రామంలోని తన బామ్మర్ది తుమ్మల పురుషోత్తంరెడ్డి ఇంటికి వచ్చాడు. రాంరెడ్డి కుటుంబ సభ్యులు దూర మవడం వలన తాగుడుకు బానిసయ్యాడు. బామ్మర్ది పురుషోత్తంరెడ్డి ఇంట్లో లేని సమయంలో పురుగుల మందు తాగి మృతిచెందాడు. మృతుడి బామ్మర్ది పురుషోత్తంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

## బైక్ అదుపుతప్పి యువకుడి మృతి


మహిపాల్ (ఫైల్)

ధర్మారం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి యువకుడు మృతి చెందిన సంఘటన ధర్మారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. శనివారం మండల కేంద్రానికి చెందిన నార మహిపాల్ (32)అనే యువకుడు బైక్‌పై ఎండపల్లి నుంచి ధర్మారం లోని ఓఫంక్షన్‌హాల్‌లో జరిగే వేడుకకు వస్తుండగా బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో మహిపాల్ తలవెనుక భాగంలో తీవ్రగాయాలు కాగా పక్క టెములకు విరిగాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు హుటా హుటిన హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో శని వారం రాత్రి చికిత్స పొందుతూ మహిపాల్ మరణించాడు. యువ కుడి తమ్ముడు జైపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శీలం లక్ష్మణ్ తెలిపారు.

## ఆర్టీసీ బస్టాండ్‌లో ఒకరు..

సుల్తానాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ఆర్‌టీసీ బస్టాండ్‌లో చెన్నైకి చెందిన జీవా(55) అనేవ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆరునెలల క్రితం జీవా సుల్తానాబాద్ వచ్చాడని, ఇతను సమీప ప్రాంతాలలో దినసరి కూలీ చేస్తూ మద్యం తాగుతు బస్టాండ్‌లోనే పడుకుంటున్నాడని వివరించారు. శనివారం జీవా అధికంగా మద్యం సేవించి బస్టాండ్ ఆవరణలో నిద్రించగా అలాగే మృతిచెందాడు. ఆదివారం సాయంత్రం కొందరు గుర్తించడంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించామని, సహచర కూలి హరి ఫిర్యాదుమేరకు కేసునమోదు చేశామని ఎస్ఐ వివరించారు.

## ప్రమాదవశాత్తు నిప్పంటుకుని వృద్ధురాలు..

కథలాపూర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన గడ్డమీద గంగు(72) అనేవృద్ధురాలి చీరెకు ప్రమాదశాత్తు నిప్పంటుకుని మృతి చెందింది. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. శనివారం రాత్రి సిలిండర్‌పై టీ తయారు చేసుకుంటున్న క్రమంలో ప్రమాదాశాత్తు చీరెకు నిప్పు అంటుకుంది. దీంతో తీవ్రగాయాలైన గంగును జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలు గంగు కొడుకు గంగనర్సయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

## కుంభమేళాకు వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం

● చికిత్స పొందుతూ మహిళ మృతి


ప్రమీల (ఫైల్)

ధర్మపురి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు కుటుంబసభ్యులతో కలిసి వెళ్లిన మహిళ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందింది. జగిత్యాలజిల్లా ధర్మపురి పట్టణానికి చెందిన వెంగళ ప్రమీల(52) అనే మహిళ తన ఇద్దరు కొడుకులు, కోడళ్లు మనుమ రాళ్లతో కలిసి ప్రయాగ్‌రాజ్ (కుంభమేళా)కు మూడు వాహనాల్లో వెళ్లారు. అనంతరం తిరిగి ఇంటికి వస్తుండగా మధ్యప్రదేశ్‌లోని రేవా ప్రాంతంలో గురువారం ప్రమీల ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ప్రమీల తీవ్రంగా గాయపడడంతో సమీపంలోని ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రమీల పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందింది. ప్రమీల మృతదేహాన్ని ఆమెస్వగ్రామమైన జూలపల్లికి తరలిస్తున్నట్లు సమాచారం.

## మంగళపల్లెలో ట్రాక్టర్ దగ్ధం


దగ్ధమవుతున్న ట్రాక్టర్

కోనరావుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని ఓరైతుకు చెందిన ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైంది. కోనరావుపేట మండలం మంగళపల్లె గ్రామానికి చెందిన ఉప్పుల జీవన్ అనే రైతు తన ట్రాక్టర్‌ద్వారా చేనులో పత్తికట్టె చదునుచేస్తున్నాడు. పక్కకు నెట్టేసిన పత్తి కట్టకు అప్పటికే నిప్పు అంటించారు. పత్తి కట్టే వైపు మిగతా చేనులోని పత్తి కట్టను నెట్టే ప్రయత్నంలో కందకంలో ట్రాక్టర్ దిగబడింది. ఆభాగంలోని మండుతున్న పత్తికట్టే ట్రాక్టర్‌టైర్‌కు అంటుకొని మంటలు చెలరేగాయి. మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైంది. దీంతో బాధిత రైతుకు మూడులక్షల వరకు నష్టం వాటిలినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు

## అటవీ ప్లాంటేషన్‌లో మంటలు

వీర్నపల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం బాబాయి చెరువుతండా గ్రామశివారులోని అటవీప్రాంతంలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించడంతో పది హెక్టార్ల ప్లాంటేషన్ మొక్కలు ఆదివారం కాలిపోయాయి. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికిచేరుకొని అగ్నిమాపకశాఖకు సమాచారం అందించడంతో ఫైర్‌ఇంజన్, ఫైర్ బ్లోయర్స్‌తో మంటలను చల్లార్చారు. అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని అటవీశాఖ సెక్షన్ అధికారి భూలక్ష్మి పేర్కొన్నారు.

## ఫోర్జరీ కేసులో నలుగురిపై కేసు

మానకొండూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్‌లోని వ్యవసాయభూమి ఫోర్జరీ కేసులో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్‌కు చెందిన కిష్టయ్య పూర్వీకులకు చెందిన భూమికి నకిలీ సాదాబైనామా తయారు చేసి మోసపూరితంగా మ్యూటేషన్ చేసిన కేసులో వినయ్‌రావు, వీరయ్య, దివ్య, వెంకటేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# అందరి చూపు.. ఉమ్మడి జిల్లా వైపు..

- పట్టభద్రుల ఎన్నికల్లో 45 శాతం ఓట్లు ఇక్కడివే
- ప్రత్యేక దృష్టి పెట్టిన అభ్యర్థులు
- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా కీలకంగా మారింది. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పరిధికి సంబంధించిన ఈ ఎమ్మెల్సీ స్థానంలో ఉన్న ఓట్లలో 45.12శాతం ఓట్లు ఉమ్మడి జిల్లాలోనే ఉన్నాయి. దీంతో అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థుల దృష్టి ఈ జిల్లాపైనే కేంద్రీకృతమవుతున్నది. పోటీలో ఉన్న అభ్యర్థులందరూ కరీంనగర్ జిల్లా కేంద్రంలో మకాం వేసి తమ ప్రచారాలను కొనసాగిస్తున్నారు.




● పట్టు సాధించేందుకు..

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనుండడంతో ఇక్కడి ఫలితాలు ఆ ఎన్నికలపై ప్రభావం చూపించే అవకాశాలు ఉన్నాయని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. ఈ ఎన్నికల నుంచి బీఆర్ఎస్ పోటీ నుంచి తప్పుకోగా, కాంగ్రెస్, బీజేపీ బరిలో ఉన్నాయి. ఇక్కడ గెలుపు సాధించడం ద్వారా వచ్చే ఎన్నికల్లో గెలుపు తమదేనని, స్థానిక సంస్థల ఎన్నికల్లోనే కాదు ఏ ఎన్నికలు వచ్చినా ప్రజల్లో తమకు ఉన్న పట్టేమిటో చాటుకోవడానికి ఈ ఫలితం ఊతంగా నిలుస్తుందని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. నియోజకవర్గ పరిధిలో 42 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా కాంగ్రెస్‌కు చెందిన వారు 23 మంది, బీజేపీకి చెందిన వారు ఏడుగురు, బీఆర్ఎస్‌కు చెందిన12 మంది ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ పరిధిలో ఆరుగురు ఎంపీలు ఉండగా నలుగురు బీజేపీకి చెందిన వారు, ఇద్దరు కాంగ్రెస్ వారున్నారు. బీఆర్ఎస్ పోటీ నుంచి తప్పుకోవడంతో కాంగ్రెస్, బీజేపీ ఈ పట్టభద్రుల స్థానాన్ని గెలుచుకోవడం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నాయి. అందుకే ఆ రాజకీయ పక్షాలు పట్టభద్రుల ఎన్నికల ఫలితాలను నిర్దేశించే స్థాయిలో ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాపైనే ప్రత్యేక దృష్టిసారించాయి.

● పోటాపోటీగా ఆత్మీయ సమ్మేళనాలు

రెండు రాజకీయ పక్షాలు నియోజకవర్గ స్థాయిలో పార్టీశ్రేణులు, నాయకులు, పట్టభద్రులతో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో 25, 50 ఓట్లకు ఒక్కరిని ఇన్‌చార్జిగా నియమించి ఆ ఓటరుతో సత్సంబంధాలు పెట్టుకొని రోజూ మాట్లాడుతూ పోలింగ్ రోజు వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకొని వచ్చి ఓటు వేసేలా చూడాలని బాధ్యతలు అప్పగిస్తున్నాయి. ఓటర్లను నేరుగా కలిసేందుకు వీలులేని పరిస్థితి ఉండ డంతో పార్టీ కేడర్‌పైనే ప్రధాన బాధ్యతను ఉంచుతు న్నారని చెబుతున్నారు. ఇరు పార్టీలకు చెందిన నాయకులు, ప్రత్యర్థి పార్టీవారు తమ తమ సమావే శాల్లో మాట్లాడుతున్న అంశాలు ఏమిటి, వారు పన్ను తున్న వ్యూహాలు ఏమిటి అనే విషయాలు తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి.

● ప్రచారంలో కీలకమవుతున్న బీసీ, స్థానిక నినాదాలు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో స్థానిక, బీసీ నినాదాలు కీలకపాత్ర వహిస్తున్నాయి. నియోజకవర్గ పరిధిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఓట్లే 45శాతం కావడంతో స్థానిక నినాదం బలంగా వస్తున్నది. అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి కరీంనగర్ జిల్లాకు చెందిన వారనే కారణంతోనే ఆయనకు కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని ప్రాంతాల నుంచి నామినేషన్ వేసిన అభ్యర్థులందరూ తాము స్థానికులమని, తమకు అవకాశం కల్పించాలని ప్రచారం చేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో బీసీ నినాదం బలంగానే వినవస్తున్నది. ఒకవైపు బీసీ కుల గణన జరుగుతుండడం, మరోవైపు రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్లు పెంచాలని రిజర్వేషన్ల విషయంలో ఇప్పటికే తమ రాజకీయ అవకాశాలను కాలరాస్తున్నారని బీసీ వర్గాలు పలు రకాల కార్యక్రమాలను చేపడుతున్నాయి. బీసీ వాదం బలంగా ఉండడంతో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు అగ్రవర్ణాలకు చెందినవారని, బీసీ కులానికి చెందిన తమకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయా అభ్యర్థులు ప్రచారం చేసుకుంటున్నారు. స్థానిక, బీసీ నినాదాలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

● నియోజకవర్గ స్వరూపం

నియోజకవర్గ పరిధిలోకి 13 జిల్లాలు పూర్తిగా, 2 జిల్లాలు పాక్షికంగా వస్తాయి. ఆరు పార్లమెంట్ స్థానాలు, 42 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఉన్నది. నియోజకవర్గ పరిధిలో 2,26, 765 మంది పురుషులు, 1,28,392 మహిళలు, ఇద్దరు థర్డ్‌జెండర్లు ఓటర్లుగా ఉన్నారు. మొత్తం నియోజకవర్గ పరిధిలో 3,55,159 ఓట్లు ఉన్నాయి. వీటిలో 1,60,260 ఓట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోనే ఉన్నాయి. ఈ ఓట్లు నియోజకవర్గ పరిధిలోని మొత్తం ఓట్లలో 45.12శాతం కావడం గమనార్హం. కరీంనగర్ జిల్లాలో 71,545 ఓట్లు, పెద్దపల్లి జిల్లాలో 31,037 ఓట్లు, జగిత్యాల జిల్లాలో 35,281 ఓట్లు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 22,397 ఓట్లు ఉన్నాయి. కరీంనగర్ జిల్లా ఓట్లనే పరిగణలోకి తీసుకున్నా 20 శాతం ఓట్లు ఇక్కడే ఉన్నాయి. రాష్ట్రం లోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలలో 42 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన పట్టభద్రులు ఓట రుగా ఉన్న ఈ నియోజకవర్గానికి ఎన్నికలు జరుగు తుండడంతో ఈ ఎన్నికలకు రాజకీయ ప్రాధాన్యం పెరిగింది.

## పోలీసులు పట్టించుకోవడం లేదు..

● న్యాయం చేయాలని సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపిన బాధితుడు


కేశవపట్నంలో పురుగుల మందు డబ్బాతో సెల్ టవర్‌పై నిరసన వ్యక్తం చేస్తున్న బాధితుడు కొంరయ్య

శంకరపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని తనకు న్యాయం చేయాలని శంకరపట్నం మండలం కేశవపట్నంలో సెల్‌టవర్ ఎక్కి ఓవ్యక్తి నిరసన తెలిపిన సంఘటన చోటు చేసుకుంది. సైదాపూర్ మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన దుర్గం కొంరయ్య ఆదివారం శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలోని సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. బాధితుడు కొంరయ్య మాట్లాడుతూ తన తమ్ముడు తిరుపతి రేకులు కూల్చి తనభార్యను కొట్టడంతో మనస్థాపం చెంది 15రోజుల క్రితం పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిందన్నారు. చికిత్స పొందుతూ శనివారం డిశ్చార్జ్ చేసి ఇంటికి తీసుకొచ్చినట్లు తెలిపారు. అయితే తన భార్యను కొట్టిన తమ్ముడిపై సైదాపూర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసిన ఎస్ఐ పట్టించుకోలేదన్నారు. తనకు న్యాయం జరగలేదంటూ ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితుడిని సెల్‌టవర్ దించేందుకు ప్రయత్నాలు చేశారు. తనకు న్యాయం జరిగేలా చూస్తానంటేనే దిగుతానని, లేదంటే ఇక్కడే ఉంటానని భీష్మించుకొని కూర్చున్నాడు. పోలీసులు అతనికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి నచ్చజెప్పి కిందకి దింపి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు.

## షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

● కాలి బూడిదైన నగదు, నిత్యావసర సరుకులు


చింతకుంటలో కాలిపోయిన గుడిసె

కథలాపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంటలో శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆలకుంట చిలుకవ్వ అనే మహిళ గుడిసె దగ్ధమైంది. విద్యుత్‌వైర్లు అంటుకోవడంతో ఒక్కసారిగా నిప్పురవ్వలు వచ్చి మంటలు వ్యాపించాయి. ఇంట్లో నిద్రిస్తున్న కుటుంబసభ్యులకు మెలకువ రావడంతో బయటకు పరుగులు పెట్టారు. దీంతో ఎలాంటి ప్రాణానష్టం జరగలేదు. ఇంట్లో ఉన్న 22 వేల రూపాయలు, నిత్యావసర వస్తువులు, బట్టలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఆదివారం కాంగ్రెస్ నాయకులు బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పారు. కాగా కూలీ పనిచేసుకుంటూ జీవనం గడుపుతున్న చిలుకవ్వ కుటుంబం ఈ ఘటనతో బజారున పడింది.

# ఓదెల మల్లన్న ఆలయంలో అభివృద్ధి పనులు

- రూ.12.18 కోట్లతో అభివృద్ధి ప్రణాళికలు
- నిర్మాణ దశలో భక్తుల వసతి భవనాలు


నిర్మాణ దశలో భక్తుల వసతి గృహం

ఓదెల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఓదెల భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ప్రముఖ ఆలయమైన ఓదెల భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి రూ.12.18కోట్లతో ప్రణాళికలను దేవాదాయ, ధర్మదాయ శాఖకు ప్రతిపాదించారు. అలాగే ఇందులో కొన్ని అభివృద్ధి పనులను చేపట్టారు. రూ.50 లక్షలతో భక్తులకు వసతి భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. ఆలయానికి రూ.47 లక్షల వ్యయంతో రథం, రూ. 50 లక్షలతో షెడ్ల నిర్మాణం, రూ.20 లక్షల వ్యయంతో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం కోసం అనుమతులు పొందారు. దాదాపు రూ.50 లక్షల వ్యయంతో మధున పోచమ్మ, బంగారు పోచమ్మ, కోనేరు నిర్మాణం కాగా, రూ.10 కోట్ల నిధుల వ్యయంతో ఆలయ ప్రాకారానికి, రాజగోపురానికి డీపీఆర్ తయారుచేసి ప్రభుత్వానికి పంపించారు.

● దాతల సహకారంతో అభివృద్ధి పనులు

ప్రస్తుతం ఆలయంలో బంగారు పోచమ్మ, మదన పోచమ్మ, గుడిలో భక్తులకు కోనేరు పనులు పూర్త య్యాయి. దాతల సహకారంతో వీరభద్ర స్వామి ఆల యం నిర్మాణం పూర్తయి ప్రారంభమైంది. హైమాస్ట్ విద్యుత్ దీపాల ఏర్పాటు, మదన పోచమ్మ, బంగారు పోచమ్మ ఆలయం చుట్టూ ప్రహరీ పనులు సాగుతున్నాయి. కాంట్రాక్టర్ సొంతంగా రూ.60 లక్షలతో గెస్ట్ హౌస్ నిర్మిస్తున్నారు. అలాగే కాలభైరవ విగ్రహానికి తొడుగులు ఏర్పాటు చేశారు. ఆలయ సందర్శనకు వచ్చే వృద్ధులు, దివ్యాంగులకు వీల్ చైర్, రెండు కూలర్లు ఏర్పాటు చేశారు.

● మిగిలిన అభివృద్ధి పనులు

ఆలయ పరిసరాల్లో మహాశివరాత్రి సందర్భంగా భక్తుల సౌకర్యం కోసం సామూహిక మరుగుదొడ్లు, స్నానాల గదులు నిర్మాణం చేయాల్సి ఉంది. పెద్దపల్లి, సుల్తానాబాద్, ఓదెల పట్టణంలో ఆలయ కమాన్ నిర్మించాల్సి ఉంది. ఇప్పటికే కమిటీల తీర్మానాలు అధికారులకు పంపించారు. దుస్తులు మార్చుకు నేందుకు షెడ్ల నిర్మాణం చేయాల్సి ఉంది. అలాగే భక్తుల బోనాల తయారీకి షెడ్ల నిర్మాణం చేయాల్సి ఉంది. భక్తులకు సరిపడు స్థలం కోసం భూసేకరణ తోపాటు, ఇతర అభివృద్ధి పనులను వేగవంతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

### ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

\- సదయ్య ఈవో ఓదెల



ఓదెల మల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి. దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచి నిధుల కేటాయింపు కొంత పరిమితంగా ఉంటుంది. భక్తుల సౌకర్యం కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

# చివరి మజిలీకి కష్టాలు

● అధ్వానంగా వైకుంఠధామాలు ● కనీస వసతులు లేక ఇబ్బందులు


మానకొండూర్: శ్రీనివాస్‌నగర్‌లో వైకుంఠధామంలో ధ్వంసమైన దింపుడు కల్లం గద్దె


గంగాధర: నిరుపయోగంగా లక్ష్మీదేవిపల్లి వైకుంఠధామం

గంగాధర, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటిల్లో అంత్యక్రియలు చేయడానికి సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారు. లక్షలు వెచ్చించి నిర్మించిన వైకుంఠ ధామాలు నిరూపయోగంగా మారుతున్నాయి. గంగాధర మండలంలో అన్ని గ్రామాల్లో ప్రభుత్వం ప్రజలందరికి చివరి మజిలీ సాఫీగా సాగాలని ఆధునిక వైకుంఠధామాలు నిర్మించారు. పలు గ్రామాల్లో మునుపటి లాగా చెరువు గట్టుకో, వాగు ఒడ్డునో, సొంత స్థలాలు ఉన్న వారు వారి భూముల్లో అంత్యక్రియలు చేస్తుంటే భూముల్లేని పేదలు అంత్యక్రియలకు ఇబ్బందులు పడుతుండేవారు. శ్మశాన వాటికలు నిర్మించడంతో ఈ సమస్యలు చాలావరకు తగ్గాయి. మండలంలోని రెండు గ్రామాల్లో మాత్రం అధికారుల నిర్లక్ష్యం వల్ల అంత్యక్రియలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హిమ్మత్‌నగర్, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో వైకుంఠధామాలు నిర్మించారు. శ్మశాన వాటికలకు దారుల లేక ఇప్పటికి సొంత స్థలాల్లో, పేదలు వాగు ఒడ్డున అంత్యక్రియలు జరుపుతున్నారు. మూడేళ్లుగా ఈ గ్రామాల్లో నిర్మించిన వైకుంఠదామాలు వినియోగించడానికి వీలు లేకుండా పోయింది. పలుమార్లు ఈగ్రామాల్లోని వైకుంఠదామాల దారి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరినా స్పందంచడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● మరమ్మతులు కరువు

మానకొండూర్: మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో నిర్మించిన వైకుంఠధామం పైకప్పు ఈదురు గాలులకు లేచిపోయింది. రెండేళ్లుగడిచినా మరమ్మతులు చేయడం లేదు. దింపుడు కల్లం గద్దె, మృతదేహాలను కాల్చే ప్రదేశం, ప్రవేశద్వారం దెబ్బతిన్నాయి. వైకుంఠధామంలో పిచ్చి చెట్లు మొలిచి అందులోకి వెళ్లలేని పరిస్థితి ఉంది. గ్రామంలో ఎవ్వరు మృతి చెందిన వారి పొలాల్లో దహన సంస్కారాలు చేసుకుంటున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వైకుంఠధామంలో సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్లాట్‌ఫాంపైకి దూసుకువచ్చిన ఆర్టీసీ బస్సు

● మహిళకు స్వల్పగాయాలు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండులో ఆదివారం ప్లాట్‌ఫాం పైకి బస్సు దూసుకురావడంతో మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జగి త్యాల వెళ్లేందుకు ప్లాట్‌ఫాం వద్దకు వచ్చే క్రమంలో నిర్దేశిత స్థానాన్ని దాటుకుని ముందుకు వేగంగా దూసుకువచ్చింది. అప్రమత్తమైన ప్రయాణికులు అక్కడినుంచి తప్పించుకున్నారు. అక్కడేఉన్న ఓ మహిళచేతికి స్వల్పగాయమైంది. వెంటనే ఆర్టీసీ అధికారులు ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రయాణికులు సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పెద్దప్రమాదం తప్పిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

## గంజాయితో పట్టుబడ్డ వ్యక్తికి రిమాండ్

రుద్రంగి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం శివారులోని నేవూరిపల్లి బస్టాండ్ వద్ద గంగాధర గ్రామానికి చెందిన పోత్నూరి రాకేష్ అనే వ్యక్తి వద్ద గంజాయి పట్టుకున్నామని చందుర్తి సీఐ వేంకటేశ్వర్లు తెలిపారు. విచారణ అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి జూడిషియల్ రిమాండ్ తరలించామని తెలిపారు.

## అడవుల సంరక్షణకు

# 'ఫైర్‌లైన్స్'

- అగ్నిప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- నిరంతరం అటవీ శాఖ అధికారుల నిఘా
- పెరుగుతున్న అటవీ సంపద

వీర్నపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వేసవికాలం వచ్చిందంటే ఏటా అడవులకు నిప్పంటుకోవడం సర్వ సాధారణంగా మారింది. అడవిలో అగ్ని ప్రమాదాల వల్ల వృక్ష సంపద, వన్యప్రాణులకు హాని కలిగే పరిస్థితులు నెలకొంటున్నాయి. అడవుల్లో అగ్ని ప్రమాదాల వల్ల వాతావరణ సమతుల్యం కూడా దెబ్బతినే ప్రమాదం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో వేసవిలో సంభవించే అగ్నిప్రమాదాల నివారణకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే వీర్నపల్లి మండలం ఎక్కువ శాతం అటవీ విస్తీర్ణం కలిగి ఉంది. అధికారులు అటవీ సంరక్షణలో భాగంగా కిలోమీటర్ల మేర 'ఫైర్‌లైన్స్' ఏర్పాటు చేస్తున్నారు.

**● అగ్ని ప్రమాదాలు జరిగే తీరు..**

వేసవికాలంలో చెట్ల ఆకులు ఎక్కువగా రాలిపోతుంటాయి. అటవీప్రాంతంలోకి పశువులను తీసుకవెళ్లిన కాపరులు తునికాకు, ఇప్పపూలు, అడ్డపిక్కలు తదితర వాటి సేకరణ



ఫైర్‌లైన్ ఏర్పాటు చేస్తున్న కూలీలు

కోసం వెళ్లి ఎవరైనా అనుకోకుండా చుట్ట, సిగరెట్, బీడీ వంటివి తాగి పడేయడంతో ఎండిన ఆకులకు అంటుకొని మంటలు వ్యాప్తి చెందుతాయి. అలాగే ఆకతాయిల చేష్టల వల్ల కూడా అడవుల్లో అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయి. గిరిజన ప్రాంతంలో అడవుల్లో ఏటా ఏదో ఒక ప్రాంతంలో అడవికి నిప్పు రాజుకుని మంటలు చెలరేగుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు అటవీ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

**● 'ఫైర్ లైన్స్' ఏర్పాటు..**

అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు అటవీ శాఖ అధికారులు 'ఫైర్ లైన్స్' ఏర్పాటు చేస్తారు. అటవీ ప్రాంతంలో కాలిబాటలో ఐదు మీటర్ల వెడల్పుతో వీటిని ఏర్పాటు చేస్తారు. చుట్టుపక్కల ఉన్న ఎండిన ఆకులను కాలి బాటలో పరిచి నిప్పు పెడతారు. ఒకవేళ ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి మంటలు చెలరేగినా ఈ దారివరకే మంటలు వ్యాప్తి చెంది ఆరిపోతాయి. మిగతా ప్రాంతానికి మంటలు వ్యాప్తి చెందకుండా ఫైర్ లైన్స్ అరికడతాయి. అడవుల సంరక్షణకు ప్రతిఏటా అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వేసవి ప్రారంభంలో ముందస్తు చర్యలు చేపడుతారు. ఫైర్‌లైన్స్ కిలోమీటర్ల మేర ఏర్పాటు చేయడం ద్వారా అగ్ని ప్రమాదాలు రాకుండా అరికట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది తీసుకున్న చర్యల వల్ల అడవులు ఎక్కువ శాతం కాలిపోకుండా చూశామని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

**● రాత్రింబవళ్లు ప్రత్యేక నిఘా..**

వేసవికాలంలో అటవీప్రాంతంలో సంభవించే అగ్నిప్రమాదాల నివారణకు రాత్రిపగలు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేసి ఎండిన ఆకులను పరిచి అవి పూర్తిగా కాలిపోయే వరకూ కాపలా ఉంటారు. అలాగే అనుకోకుండా మంటలు వ్యాప్తి చెందితే అందుబాటులో ఉన్న



వీర్నపల్లిలో ఏర్పాటు చేసిన ఫైర్‌లైన్

సిబ్బంది మంటలను అదుపుచేస్తారు. వీటివల్ల అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉంటాయి.

**● శాటిలైట్ ద్వారా ముందస్తు సమాచారం..**

అటవీప్రాంతంలో పెద్ద ఎత్తున అగ్నిప్రమాదం చోటు చేసుకుంటే శాటిలైట్ ద్వారా వచ్చే సమాచారాన్ని తక్షణమే అటవీశాఖ అధికారులకు సమాచారాన్ని చేరవేస్తుంది. దీనితో ఫారెస్ట్ అధికారులు అప్రమత్తమై ఆయా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువస్తారు.

**అన్నిప్రాంతాల్లో ఫైర్ లైన్స్ ఏర్పాటు చేయాలి..**



- బండారి మహేష్, గొర్ల కాపరి, మద్దిమల్ల

మండలంలోని అన్నిప్రాంతాల్లో ముందస్తుగా అధికారులు ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేయాలి. ఫైర్‌లెన్స్ నామమాత్రంగా కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాటు చేయాలి. జంతువులు, అడవులకు నష్టం కలిగించొద్దు.

**ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం..**

- పద్మలత, ఎఫ్ఎస్‌వో, అల్మాస్‌పూర్



అడవులు, జంతువుల సంరక్షణ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాలను ఫైర్ వాచర్స్ ద్వారా నివారిస్తున్నాం. అటవీ ప్రాంతంలో కిలోమీటర్ల పరిధిలో ఫైర్ లైన్స్ ఏర్పాటు చేస్తున్నాం. వీటి ద్వారా మంటలను వ్యాప్తి చెందకుండా నివారించేలా కృషి చేస్తున్నాం. అలాగే అగ్నిప్రమాదాల నివారణపై పరిసర ప్రాంత ప్రజలకు పూర్తి అవగాహన కలిగిస్తున్నాం.

## నిరుద్యోగుల కోసం పోరాటం చేసింది బీజేపీ మాత్రమే

● కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు, ఉద్యోగుల పక్షానపోరాటం చేసింది ఒక్క బీజేపీ మాత్రమే అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో కరీంనగర్ ఎమ్మెల్సీ నియోజకవర్గ సోషల్‌మీడియా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధి కారంలోకి రావాలనే లక్ష్యంతో పనిచేసే కార్యకర్తలు బీజేపీకి సొంత మన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగుల పక్షాన పోరాటం చేస్తే లాఠీ దెబ్బలు తిన్నామన్నారు. గ్రూప్‌వన్ ఉద్యోగుల పక్షాన పోరాటం చేస్తే నిరుద్యోగుల మధ్యకు చేరి బీఆర్‌ఎస్‌నాయకులు విధ్వంసం సృష్టించాలని చూశారన్నారు. కాంగ్రెస్‌నేతలు ప్రతి పనికి 14నుంచి 18శాతం కమిషన్ అడుగుతున్నారన్నారు. 317జీవోకోసం ఎంపీ కార్యాలయంలో దీక్షచేస్తే కార్యాలయగేట్లను గ్యాస్ కట్టర్లతో పోలీసులు కోశారన్నారు. నా ఆఫీసును ఎక్స్‌కావేటర్‌తో కూల్చాలని కేసీఆర్ సీపీకి వార్నింగ్ ఇచ్చారన్నారు. అయినా ఏనాడు భయపడలేదన్నారు. బీజేపీ కార్యకర్తలు సిద్ధాంతాల కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టారన్నారు. సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మాజీఎమ్మెల్సీ ఎన్వీఎస్ ప్రసాద్, మాజీమేయర్ సునీల్‌రావు, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి జె సంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతరప్రాంతాల నుంచివచ్చిన భక్తులు ముందుగా రాజన్న కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో భక్తులు కుంకుమ పూజలో పాల్గొని బద్దిపోచమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

## నరసింహుడి ఆలయంలో భక్తుల పూజలు



ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిక్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయాల్లో భక్తులు ఆదివారం పూజలు నిర్వహించారు. మాఘమాసం బహుళ చవితి సందర్భంగా. సుదూరప్రాంతాల నుంచి క్షేత్రానికి భారీగా భక్తులు తరలివచ్చారు. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. అందంగా పూలతో అలంకరించినస్వామి వారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేద మంత్రోచ్చరణల మధ్య ఆలయ అర్చకులు పూజలు చేశారు. అనేక మంది భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్ కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**● రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సెక్రెటరీ పూజలు..**

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి దేవాల యాన్ని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు సెక్రెటరీ గుగులోతురవి దంపతులు ఆది వారం సందర్శించారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు. అంతకుముందు ఆయన యమధర్మరాజు ఆలయం వద్ద గండదీపంలో నూనెపోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అలాగే ఆయన అనుబంధ ఆలయాల్లో స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఆయన వెంట అర్చకులు నేరెళ్ల విజయ్, సుముద్రాల వంశీకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**అంజన్న సన్నిధిలో..**

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామిని ఆదివారం రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సెక్రెటరీ గుగులోతు రవి దర్శించుకున్నారు. సతీసమేతంగా ఆలయంకు వచ్చిన ఆయన స్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, ఉపాధ్యాయుల చంద్రశేఖర్, ప్రధానఅర్చకులు రామకృష్ణ, ఉపప్రధానర్చకులు చిరంజీవి తదితరులు ఉన్నారు.



కొండగట్టు అంజన్న సన్నిధిలో రవి దంపతులు

## వైభవంగా మల్లన్న బోనాలు



ఆత్మకూర్‌లో బోనాలతో బయలుదేరిన భక్తులు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో మల్లన్న జాతరను యాదవులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మల్లన్నస్వామి ఆలయాన్ని పచ్చటితోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయంనుంచి మండలంలోని ఆయాగ్రామాల్లోని భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి ఒడిబియ్యం పోసి కానుకలు సమర్పించుకున్నారు. సాయంత్రం మహిళలు, భక్తులు ఉపవాస దీక్షలతో భక్తిశ్రద్ధలతో బోనం కుండలను అలంకరించి నైవేద్యాన్ని తయారు చేశారు. భక్తులు బోనమును నెత్తిన ఎత్తుకుని డప్పుచప్పులతో ఆలయానికి బయలుదేరారు. ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. భక్తులు బోనాలతో ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా మాజీసర్పంచ్ చౌట్‌పల్లి లావణ్య-అంజయ్యతోపాటు పలువురు నాయకులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు జరిపి తీర్థా ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో యాదవ సంఘం, ఆలయాభివృద్ధి నాయకులు, సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్ ఇన్‌చార్జిలు

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జీలను నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని కరీంనగర్, మానకొండూర్, చొప్పదండి, హుజురాబాద్ నియోజకవర్గాలతో పాటు వేములవాడ, సిరిసిల్ల, హుస్నాబాద్ నియోజకవర్గాలకు మంత్రి పొన్నంప్రభాకర్ ఇంచార్జి మంత్రిగా వ్యవహరిం చనున్నారు. అలాగే కరీంనగర్ నియోజకవర్గానికి ఎమ్మెల్సీ భానుప్రసాద్, పురుమల్ల శ్రీనివాస్ ఇంచార్జిలుగా, కోఆర్డినేటర్‌గా ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగ రాఘవరెడ్డి నియామకమయ్యారు. చొప్పదండి కోఆర్డినేటర్‌గా ఎనగల వెంకట్రాంరెడ్డి, మానకొండూర్‌కు గంప వేణుగోపాల్. హుజురాబాద్‌కు ఎండీ రియాజ్‌ను కోఆర్డినేటర్‌లుగా నియమించారు. హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జిగా ఒడితెల ప్రణవ్‌బాబును నియమించారు. కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యేలను ఆయా నియోజకవర్గ ఇంచార్జిలుగా, కాంగ్రెస్ ఎమ్మెల్యే లేనిచోట డిఫీటెడ్ ఎమ్మెల్యే అభ్యర్థులను ఇంచార్జిగా నియమించారు. కరీంనగర్ సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డికి నిజామాబాద్ అర్బన్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించారు.

## ఘనంగా సంకష్టహర చతుర్థి పూజలు

ధర్మపురి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆవరణలోగల గణపతి ఆలయంలో ఆదివారం ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వ హించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథం, సాయికుమార్, స్థానిక వేదపండితులు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



గణపతి ఆలయంలో అభిషేకాది పూజలు

## కొన'సాగు'తున్న పనులు

- నత్తనడకన రైల్వే ఫ్లైఓవర్ పనులు
- భూ యజమానులకు అందని పరిహారం
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కూనారం ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. సౌత్ సెంట్రల్ రైల్వే చేపట్టే పనులు కొనసాగుతుండగా రోడ్డు భవనాల శాఖ పనులు నిలిచిపోయాయి. టెండర్ కాలం ముగిసిన పనులు 60 శాతం కూడా పూర్తి కాలేదు. దీంతో వాహనాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లా కేంద్రంలోని కూనారం రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలనే ప్రతిపాదనలు ఎప్పటి నుంచో ఉన్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.119 కోట్లు కేటాయించింది. రోడ్లు భవనాల శాఖ రూ.34 కోట్లతో ట్రాక్‌కు ఇరువైపుల వంతెన నిర్మించాల్సి ఉంది. మిగితా రూ.85 కోట్లతో ట్రాక్ లైన్ పై సౌత్ సెంట్రల్ రైల్వే శాఖ స్టీల్ వంతెన నిర్మించాల్సి ఉంది. పట్టాలకు ఇరువైపుల 550 మీటర్ల వంతెన 46 పిల్లర్లతో ఆర్‌అండ్‌బీ శాఖ పనులు చేయాల్సి ఉంది. సర్వీస్ రోడ్డు అప్రోజ్ రోడ్డు, బ్రిడ్జీ పనులు నిలిచిపోయాయి. ఈ పనులకు రెండు సార్లు భూమి పూజ చేసినప్పటికి ప్రారంభం కాలేదు. ముచ్చటగా మూడో సారి 2022లో భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. సెప్టెంబరు 2024 నాటికి పూర్తి చేయాల్సి ఉండగా పనులు కొనసాగుతున్నాయి. రైల్వే శాఖ పనులు జరుగుతుండగా ఆర్‌అండ్‌బీ శాఖ పనులు ముందుకు సాగడం లేదు. డ్రాయింగ్ అప్రూవల్, ల్యాండ్ అక్వేషన్‌లో సమస్యలు, విద్యుత్ లైన్లు తొలగింపు తదితర అంశాలు నిర్మాణానికి అడ్డంకిగా మారాయి. ఈ సమస్యలను పరిష్కరించి భూసేకరణ చేసి నివేదికను ప్రభుత్వానికి పంపించారు. అయితే భూ యజమానులకు డబ్బులు చెల్లించకపోవడంతో రోడ్డు భవనాల శాఖ అధికారులు పనులు నిలిపివేశారు. పనులు నిలిచిపోవడంతో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు గతేడాది మార్చిలో రైల్వే, ఆర్‌అండ్‌బీ అధికారులతో బ్రిడ్జి వద్ద సమావేశం నిర్వహించారు. అక్టోబర్ వరకు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ తెలిపాడు. ఇది జరిగి సుమారు ఏడాది కావస్తున్నా పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి.



కొసాగుతున్న రైల్వే ఫ్లైఓవర్ పనులు

**భూ సేకరణ డబ్బులు చెల్లించలేదు**

- ఆర్అండ్‌బీ ఈఈ డీ బాపు సింగ్

బ్రిడ్జి నిర్మాణ పనుల్లో ఆలస్యం వాస్తవమే. అయితే భూ సేకరణ చేసి వివరాలు ప్రభుత్వానికి పంపించాం. డబ్బులు వచ్చాక రెవెన్యూ శాఖ అధికారులు భూమి యజమానులకు అందజేస్తారు. అప్పటి వరకు పనులు జరగవు.

**● వాహనదారుల ఇక్కట్లు**

కూనారం రూట్‌లో రైల్వే గేటు పడిందంటే గంటకు పైమాటే వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. మూడు నుంచి ఐదు రైళ్లు వెళితే గాని గేటు తెరవకపోవడంతో ఉద్యోగులు, విద్యార్థులు రోజూ ఇబ్బందులు పడుతున్నారు. 2022లో ఫ్లైవోర్ బ్రిడ్జి పనులు మొదలయినప్పటికి ఇప్పటికి పూర్తి కాకపోవడంతో ఏళ్ళ తరబడి సమస్య అలాగే వెంటాడుతోంది. గుంపుల తనుగుల మధ్య ఒక వంతెన, హుస్సేనిమియా వాగు పై చిన్నరాతుపల్లి, పెద్దరాతుపల్లి మధ్య మరో వంతెన, కునారం వద్ద మరో బ్రిడ్జి నిర్మించడంతో ఈ దారి గుండా వాహనాల రాకపోకల సంఖ్య పెరిగింది. మంథని వరంగల్, జమ్మికుంట, కాల్వ శ్రీరాంపూర్‌లకు వాహనాలు ఈ దారి గుండా వెళ్తున్నాయి. గేటు సమస్యతో ఈ దారి గుండా వెళ్ళే ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులు, గర్భిణులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పాఠశాలలకు, కాలేజీలకు వెళ్ళే విద్యార్థులు సమయానికి చేరుకోక చివాట్లు పడుతున్నారు. బయోమెట్రిక్ విధానంతో ఉద్యోగులు సరైన సమయానికి చేరుకోకపోవడంతో గైర్హాజరు కావాల్సి వస్తోంది. ఆటోలు, టాటా ఏసీలు గంటల తరబడి గేటు వద్దే ఉండడం వల్ల ట్రిప్పులు పడడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు జరిగే చోట తాత్కాలిక రోడ్డు వేయకపోవడంతో దుమ్ముధూళితోనే గంటల తరబడి గడుపుతున్నారు. బ్రిడ్జి పనులు వెంటనే పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.



గేటు వద్ద వాహనదారుల నిరీక్షణ

## నేరెళ్ల సాంబశివుడి ఆలయ కమిటీ సమావేశం

ధర్మపురి, ఫిబ్రవరి 16 ( ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరెళ్ల సాంబశివుడి దేవాలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలు, భక్తుల వసతుల ఏర్పాట్లు గురించి చర్చించారు. అనంతరం ఆలయ వేదపండితులు పర్వతగిరి ప్రశాంత్ శాస్త్రి ఆధ్వర్యంలో ఆలయంలో నిర్వహించే కార్యక్రమాలు సంబంధించిన పత్రికను ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా శివ పార్వతుల కల్యాణ మహోత్సవం, 27న రుద్ర హవనం, రథ హోమం, రథబలి, స్వామి వారల రథోత్సవం, అన్నదానం, మార్చి 1న ఎడ్లబండ్ల పోటీలు నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్ర మంలో ఆలయ కమిటీ చైర్మన్ కాసారపు రాజాగౌడ్, వైస్ చైర్మన్ జాజాల రమేష్, ప్రధాన కార్యదర్శి జాజాల రవీందర్, కోశాధికారి షేర్ల రాజేశం, కార్యదర్శి ఉడుత గంగారం, కార్యదర్శి లక్ష్మణ్, ముఖ్య సలహాదారు గుంపుల రమేష్, మాజీ ఎంపీటీసీ కాశెట్టి మల్లేశం, శివ దీక్షాపరులు పాల్గొన్నారు.

## వాటర్ కూలర్ అందజేత

కొడిమ్యాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివభక్త మార్కండేయ స్వామి ఆలయానికి జంకె జ్యోతివెంకట్‌రెడ్డి దంపతుల కుమారుడు జంకె దిలీప్‌రెడ్డి జ్ఞాపకార్థం 25 వేల రూపాయల విలుగల వాటర్ కూలర్‌ను ఆలయ కమిటీ వారికి అందించారు. వాటర్ కూలర్‌ను అందించిన దాతలకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు వొల్లాల లింగా గౌడ్, గ్రామస్థులు ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీపతి, దామోదర్, గంగాధర్, నారాయణ, రాజమల్లయ్య, రాజేశం, రమేష్, భాస్కర్, ఆలయ పూజారి ప్రభాకర్‌శర్మ పాల్గొన్నారు.

# నిబంధనలు గాలికి..

- ఇష్టానుసారంగా వెంచర్ల ఏర్పాటు
- 10 శాతం స్థలాన్ని వదలకుండానే ప్లాట్లు
- పట్టించుకోని అధికారులు



వెంకట్రావ్‌పేట శివారులో అక్రమంగా వెలసిన వెంచర్లు, వెంచర్‌లో నిర్మించిన ప్రహరీ

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అక్రమ వెంచర్ల దందా జోరుగా సాగుతోంది. అరికట్టాల్సిన అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే అరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఎలాంటి అనుమతులు లేకుండానే వ్యాపారులు ప్లాట్లు విక్రయిస్తున్నారు. అక్రమ వెంచర్లు వెలుస్తున్న వాటిలో ఎకరం మొదలు ఐదెకరాల వరకు ఉన్నవే అధికంగా ఉంటున్నాయి. ఈ తరహా వెంచర్లలో పట్టాదారు పాసుబుక్ ఆధారంగా కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ జరిగేలా చూస్తున్నారు. అనుమతులు పొందినట్లు కొందరు.. వచ్చేస్తున్నాయని మరికొందరు.. ప్లాట్లను అమ్ముతూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకస్తున్న అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపి స్తున్నాయి. ప్లాట్లను కొనుగోలు చేసిన తర్వాత వాటికి అధికారిక అనుమతులు లేవని తెలుసుకోని ప్రజలు నానా పాట్లు పడాల్సి వస్తుంది. రూపాయి రూపాయి కూడబెట్టుకుని ప్లాటు కొంటున్న మధ్యతరగతి వారు నిర్మాణ అనుమతులుకు వెళ్లినప్పుడు అసలు నిజాలు బయటపడటంతో నివ్వెరపోతున్నారు. ప్రధానంగా పట్టణంలోని జాతీయ రహదారి వెంబడి, వెంకట్రా వ్‌పేట గ్రామ శివారులోని 2వ బిట్‌లో, చిలుకల చిన్న మ గుడి వద్ద, సాయిబాబా ఆలయనికి సమీపంలో, ఆరపేట వై కన్వెన్షన్‌కు దగ్గరలో వెంచర్లను ఏర్పాటు చేసి అమ్మకాలు జరుపుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

నిబంధనల ప్రకారం 10 శాతం గ్రామ పంచాయతీ అభివృద్ధికి పార్క్‌కు తదితర అవసరల కోసం భూమిని వదిలేయాల్సి ఉన్నా అవేమి వదిలేయకుండానే రియల్ ఎస్టేట్ వ్యాపారులు దండుకుంటున్నారు. ఇప్పటికైనా పట్టణంలో వెలిసిన అక్రమ వెంచర్లపై మున్సిపల్ ప్రత్యేకాధికారి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**● నిబంధనలకు తూట్లు**

పట్టా భూముల్లో వెంచర్లు ఏర్పాటు చేయాలంటే మున్సిపాలిటీలో పలు నిబంధనలు ఉన్నాయి. వెంచర్లు ఏర్పాటు చేసే స్థలాలు వ్యవసాయ భూములుగా, పారిశ్రామిక ప్రాంతాలుగా ఉండకూడదు. నివాసయోగ్యంగా ఉండాలి. వ్యవసాయ భూముల్లో వెంచర్లు ఏర్పాటు చేయలంటే మొదట వాటిని నివాస స్థలాలుగా మార్చుకోవాల్సి ఉంటుంది. ఇందుకు నిర్ణీత రుసుం చెల్లిస్తూ సంబంధిత ఆర్డీవోకు నాలా కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. నాలా కన్వర్షన్ అనంతరం లే అవుట్ అనుమతులు సంబంధిత మున్సిపాలిటీ నుంచి అనుమతి తీసుకోవాలి. అయితే ఇవేమి లేకుండానే రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవసాయ భూముల్లో అక్రమంగా వెంచర్లు ఏర్పాటు చేస్తు నిబంధనాలకు తూట్లు పోడుస్తున్నారు.

**● ఆదాయనికి భారీగా గండి...**

లే అవుట్ అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న వెంచర్ల కారణంగా ప్రభుత్వానికి పెద్ద ఎత్తున గండి పడుతోంది. ఆర్డీవో నుంచి నాలా కన్వర్షన్ అనుమతులు రాగానే లే అవుటు కోసం మున్సిపాలిటి దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు గాను నిర్ణీత స్థలంలో నుంచి 10 శాతం భూమిని పార్కులు తదితర నిర్మాణల కోసం అప్పగించాల్సి ఉంటుంది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ టి మోహన్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా లే అవుట్ లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తున్న వాటిని గుర్తించామన్నారు. అక్కడ హద్దు రాళ్లను తొలగించినట్లు తెలిపారు. లే అవుట్ లేకుండా ఎవరు ప్లాట్లు విక్రయించిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### ప్లాట్లు కొనే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ● పట్టణాల్లో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసే ముందు సంబంధిత యజమానుల పేర్లు రెవెన్యూ రికార్డుల్లో సరిచూసుకోవాలి.
- ● సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈసీ పత్రం పరిశీలించుకోవాలి.
- ● భూమిపై ఏదైనా వివాదం ఉందా అనే విషయం తెలుసుకోవాలి.
- ● మున్సిపల్ లే అవుట్ ఉన్న ప్లాట్లనే కొనుగోలు చేయాలి.
- ● వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేసిన ప్లాట్లకు నాలా అనుమాతులు ఉన్నాయోలేదో చూసుకోవాలి.
- ● కొనుగోలు చేసే ప్లాట్లు ప్రభుత్వ స్థలమా, పట్టాదారు స్థలమా అని తెలుసుకోవాలి.
- ● లే అవుట్ అనుమతి లేని ప్లాట్లను కొనుగోలు చేస్తే ఇంటి నిర్మాణానికి అనుమతులు, బ్యాంకు రుణాలు లభించే అవకాశాలు ఉండవు.

## పరీక్షలకు వేళాయె

(5వ పేజీ తరువాయి)

పదోతరగతి విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. వీరితో పాటు డిగ్రీ, పీజీ, ఓపెన్ స్కూల్, పీజీ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు సైతం ప్రిపరేషన్‌పై దృష్టి సారించారు.

**విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి..**

**- డాక్టర్ సాకేత్‌రెడ్డి, మానసిక వైద్యనిపుణుడు, జగిత్యాల**



చదివిన సిలబస్ పరీక్షల్లో రాయగల సామర్థ్యం రావాలంటే మానసిక ప్రశాంతత, ఆరోగ్యంపై శ్రద్ధవహిస్తూ సులభంగా జీర్ణమయ్యే ఆహారం, తగినంత నిద్ర, నీరు తాగడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. పరీక్షలపై ఉన్న భయాన్ని, మానసిక ఒత్తిడిని తగ్గించడానికి ప్రాణాయామం, మెడిటేషన్ చేయాలి. చదువు మధ్యలో స్వల్ప విరామం తీసుకోవాలి. నీరు, కొబ్బరినీరు, మజ్జిగ తాగడం మంచింది. పరీక్షకు వెళ్లే ముందు, పరీక్ష హాలులో మౌనంగా ఉండాలి. అవసరమైన పౌష్టికాహారం అందించి ఆరోగ్యంగా ఉండేలా చూస్తూ వారితో స్నేహపూర్వకంగా తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు మెలగాలి.

**చదువుతో పాటు రాయడం ప్రాక్టీస్ చేయాలి**

**- తులసి ఆగమయ్య, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, జగిత్యాల జిల్లా**



పరీక్షల ప్రాక్టీస్‌లో బాగంగా చదవడంతో పాటు విద్యార్థి రాయడం చేయాలి. పబ్లిక్ పరీక్ష ముందు రోజు వరకు రాస్తున్న సాధారణ పరీక్షలను పబ్లిక్ పరీక్షగా భావిస్తూ ప్రాక్టిస్ చేయాలి. పరీక్షలో జవాబు పత్రాన్ని రాస్తున్నప్పుడు ఎటువంటి గాబరా పడకుండా ప్రశ్నాపత్రాన్ని నిశితంగా చదవాలి. ఆపై బాగా వచ్చే ప్రశ్నలను ముందుగా రాయాలి. మర్చిపోకూడదు. సమయం మిగిలితే ఛాయిస్‌తో కలిపి సమాధానాలను రాయాలి.

# ఎండిపోతున్న మొక్కలు

- లక్షల ప్రజాధనం వృథా
- చెట్లను నరికినా పట్టించుకోని అధికారులు



గోవిందు పల్లెలో ప్రధాన రహదారి పక్కన ఎండిపోయిన మొక్క, ఆనవాళ్లు కోల్పోయిన మొక్కలు

గొల్లపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) మండలంలో వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. ఈ యేడు వానకాలం ప్రారంభంలో వన మహోత్సవంలో భాగంగా జగిత్యాల-ధర్మారం ప్రధాన రహదారికిరువైపులా, అలాగే గ్రామాల్లో లక్ష్యం మేరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మొక్కలను నాటారు. వాటిని సంరక్షించడంలో సంబందిత అధికారులు, సిబ్బంది విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన తెలంగాణకు హరిత హారం పథకంలో భాగంగా నాటిన మొక్కలు, ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలు గొల్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సంరక్షణ కరువై ఎండిపోతున్నాయి. లక్షల ప్రజాధనం వెచ్చించి నాటిన మొక్కలు ఎండిపోతుండడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. జగిత్యాల-ధర్మారం ప్రధాన రహదారికిరువైపులా, అన్నిగ్రామాల్లో ఏటికేడు మొక్కలు నాటడంలో చూపే శ్రద్ధ వాటిని సంరక్షించడంలో అధికారులు చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే పలు గ్రామా ల్లో, ప్రధాన రహదారికిరువైపులా నాటిన మొక్కలను నరికేస్తున్నా పట్టించుకునే నాథులు కరువయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో అటు ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా, లక్షల ప్రజాధనం వృథా అవుతోందని ప్రజలు వాపోతున్నారు.

**● నాటిన మొక్కలు లక్షలు..**

గొల్లపల్లి మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలు ఉండగా, ఈ వానాకాలం ప్రారంభంలో తొమ్మిదో విడతలో భాగంగా 2,50,000 మొక్కలు నాటాలని లక్ష్యం కాగా, 1,40,000 వేల మొక్కలు నాటినట్లు రికార్డులు పేర్కొంటున్నాయి. నాటిన మొక్కలు లక్షల్లో అయితే, ప్రస్తుతం సజీవంగా ఉన్నవి మాత్రం వెయ్యిల్లోననే అభిప్రాయాలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. నాటిన మొక్కలను సంరక్షించడంలో నిర్లక్ష్యం వహించడంతో పలు గ్రామాల్లో మొక్కలు ఎండిపోగా, మరి కొన్ని గ్రామాల్లో మొక్కల ఆనవాళ్లు సైతం లేకుండా పోయాయి. పలు గ్రామాల్లో అభివృద్ధి పేరిట, అవసరాల పేరిట, విద్యుత్ సరఫరాకు అంతరాయంగా నిలుస్తున్నాయనే నెపంతో ప్రతి ఏటా వేల చెట్లను విచక్షణా రహితంగా నరికివేస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**● ఎండలు ముదరక ముందే ఇలా..**

వేసవి కాలం ప్రారంభంలోనే మండలంలోని చాలా గ్రామాల్లో వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలకు ఆలనాపాలనా కరువై ఎండిపోతుండడంతో ప్రజలు అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వేసవికాలం ప్రారంభంలోనే మొక్కలకు నీరు పట్టక ఎండిపోతుండగా, ముమ్ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకుని నాటిన మొక్కలను సంరక్షించాలని, చెట్లను నరికే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**ఆప్టికల్ ఫైబర్ లైన్ పైపులు వేయడం వల్లే..**

**- వేణు, ఏపీవో, ఈజీఎస్**

రోడ్ల వెంట ప్రైవేట్ కంపెనీ వాళ్లు ఆప్టికల్ ఫైబర్ పైపులు వేయడం వల్ల నాటిన మొక్కలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. భూమి లోపలి నుంచి పైపులు వేయడం వల్ల అప్పటికే నాటిన మొక్కలు అందులో గల్లంతు అవుతున్నాయి. ప్రస్తుతం ఉన్నవాటికి నీరు పడుతున్నాం. నర్సరీ కేంద్రాలతో పాటు వన మహోత్సవంలో భాగంగా రోడ్ల వెంట, గ్రామాల్లో నాటిన మొక్కలను సంరక్షించడానికి చర్యలు తీసుకుంటున్నాం. అందుబాటులో ఉన్న ట్యాంకర్ల ద్వారా మొక్కలను కాపాడేందుకు కృషి చేస్తున్నాం.

## రెండు గ్రామాల్లో వీఎన్ఆర్ టీం ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కొడిమ్యాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి ఊటుకూరి నరేందర్‌రెడ్డిని బారీ మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను కోరుతూ ఆదివారం మండలంలోని పూడూర్, అప్పారావుపేట గ్రామాలలో వీఎన్ఆర్ టీం పీఆర్‌వో రేకులపలల్లి సతీష్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్‌వో మాట్లాడుతూ జాతీయ స్థాయిలో కొడిమ్యాలకు మంచి పేరు తీసుకవచ్చిన అల్‌ఫోర్స్ విద్యా సంసంస్థల అధినేత, విద్యావంతుడైన నరేందర్‌రెడ్డిని పట్టభద్రులు ఈ నెల 27జరుగుఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆయన విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు సహాయం చేయడంతో పాటు, 5వేల మందికి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలిపించారన్నారు. ఈ ప్రచారంలో వీఎన్ఆర్ టీం సభ్యులు శివ, మనోజ్, సతీష్, బార్గవ్ తదితరులు ఉన్నారు.

## రాయికల్ లయన్స్ క్లబ్‌కు

# ఉత్తమ బ్యానర్ ప్రెజెంటేషన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రాయికల్ లయన్స్ క్లబ్ కార్యవర్గం

రాయికల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాయికల్ లయన్స్ క్లబ్‌కు ఉత్తమ బ్యానర్ ప్రెజెంటేషన్ అవార్డు లభించింది. మంచిర్యాల జిల్లా జన్నారంలో జరిగిన లయన్స్ క్లబ్ రీజన్ మీట్ కార్యక్రమంలో బ్యానర్ ప్రెజెంటేషన్‌లో భాగంగా కుంభమేళా విశిష్టతను ప్రదర్శించిన రాయికల్ లయన్స్ క్లబ్‌కు ఉత్తమ బ్యానర్ ప్రెజెంటేషన్ అవార్డును రీజన్ చైర్ పర్సన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి చేతులమీదుగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్ అందుకున్నాడు. ఉత్తమ కార్యదర్శి, కోశాధికారిగా కడకుంట్ల నరేష్, కట్లనర్సయ్య, ఉత్తమ లయన్ దంపతులుగా మ్యాకల అనురాధరమేష్ అవార్డులను అందుకున్నారు. 2024-25 సంవత్సర లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా అవార్డులు అందుకున్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్, మోర హన్మాండ్లు, లయన్స్ క్లబ్ సభ్యులు దాసరి గంగాధర్, కొమ్ముల ఆదిరెడ్డి, వాసం ప్రసాద్, బొమ్మకంటి నవీన్, గంట్యాల ప్రవీణ్, కొత్తపెల్లి రంజిత్, వాసం స్వామి, ఆడెపు రాంప్రసాద్, ఎర్ర సుమన్, పారిపెల్లి శివప్రసాద్, సాంబారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎండిపోతున్న వరిపంటకు

# నీరు అందించి ఆదుకోవాలి



చౌలమద్దిలో ఎండిపోతున్న పొలాన్ని చూపుతున్న రైతు

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఎండిపోతున్న వరి పంటలకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని మెట్‌పల్లి విశాల సహకార సంఘం మాజీ చైర్మన్ తీగల లింగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండలంలోని చౌలమద్ది గ్రామంలోని రైతుకు సంబంధించిన పొలం ఎండిపోతోందని చూపుతూ సోషల్ మీడియాలో పోస్టు చేసి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో డీ-36 కాలువ ద్వారా నీరు అందించక పోవడంతో పొలాలు ఎండిపోతున్నాయని ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నియోజక వర్గంలో నీరు పుష్కలంగా ఉన్నా ఉపకాలువల ద్వారా నీరు అందకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయన్నారు. రైతులకు సక్రమంగా సాగు నీరు ఇచ్చి రైతులకు మేలు చేయాలని డిమాండ్ చేశారు.

# వృద్ధులను విస్మరిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న హరి అశోక్ కుమార్

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వృద్ధులను విస్మరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జగిత్యాల జిల్లా సీనియర్ సిటీజన్స్ అధ్యక్షులుమరి అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటీజన్స్ కార్యాలయంలో పలువురు వృద్ధుల పిర్యాదు మేరకు వారి వారి కుమారులను, కూతుళ్లను, కుమారులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు, ఈ సందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులను పోషషించకుండా విస్మరిస్తే ఆరు నెలల పాటు జైలు శిక్ష విధించడంతో పాటు జరిమానా విదిస్తారని హెచ్చరించారు. అనంతరం తమ తల్లిదండ్రులను పోషిస్తామని వారినుంచి రాత పూర్వకంగా హామీ తేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటీజన్స్ నాయకులు వెల్మల ప్రకాశ్ రావు, బైరి రాధ, కరుణ, గౌరిశెట్టి విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వాలు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. ఆదివారం నగరం లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కుల గణన సక్రమంగా నిర్వహించలేదని, వారి సంఖ్యను తక్కువగా చూపారని ఆరోపించారు.

దళిత బహుజన పార్టీ నగర అధ్యక్షుడిగా నగరానికి చెందిన గోత్రాల శ్రీనివాస్‌ని నియమించారు. ఆదివారం ప్రెస్‌భవన్‌లో నియామక పత్రాన్ని అంద జేశారు. జిల్లా ఇన్‌చార్జి రాగి రాజేశ్, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రామచందర్, జిల్లా ఇన్‌చార్జి చిప్పర్తి కరుణాకర్, హన్మకొండ ఇన్‌చార్జి ఆకుతోట సతీష్, ఎస్సీ ఎస్టీ అడ్వకేట్స్ ఫోరం రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాజలింగం, మాలమహానాడు నందబోయిన జిల్లా అధ్యక్షుడు రాకేశ్ పాల్గొన్నారు.

## అలరించిన విద్యార్థుల ఆటాపాట



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

కోరుట్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సాయిజీనియస్ విద్యార్థుల ఆట పాట అలరింపజేసింది. ఆదివారం పట్టణంలోని బీముని దబ్బు ప్రాంతంలోని సాయిజీనియస్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు తొమ్మిద తరగతి విద్యార్థులు ఇచ్చిన వీడుకోలు సమావేశంలో పాఠశాల సందడిగా మారింది. ఈ సందర్బంగా విద్యార్థులు చేసిన నృత్య, నాటిక కార్యక్రమాలు అలరింపజేశాయి. ఈ కార్యక్రమంలో సాయిజీనియస్ పాఠశాల కరస్పాడెంట్ చౌకి రమేష్, పిన్సిపల్ చౌకి సుధ, మధుశ్రీ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నిధుల మంజూరుకు కృషి చేయాలి

కోరుట్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాస్వామి దేవాలయ అభివృద్ధికి నిదులు మంజూరు చేయించాలని కోరుతూ దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ పురోహితుడు నిజామాబాదు ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు ఆదివారం వినతి పత్రం అందించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎంపీ అర్వింద్ నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పురోహితుడు పాలెపు భరద్వాజ్ శర్మలతో పాటు దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్‌ల గడువు పెంచడం హర్షణీయం



ఎమ్మెల్యేకు స్వీట్లు తినిపిస్తున్న విండో చైర్మన్

కథలాపూర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సింగిల్ విండో సొసైటీల కాలపరిమితి మరో ఆరు మాసాలు పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గంబీర్‌పూర్ సింగిల్ విండో చైర్మన్ దాసరి గంగాధర్ స్వీట్లు తినిపించారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల రైతులకు మరింత సేవ చేయడానికి అవకాశం చిక్కిందని అన్నారు. ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి స్వీట్లు అందజేశారు.

మల్లాపూర్, ఫిబ్రవరి, 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో చైర్మన్‌ల పదవి కాలం మరో ఆరు నెలలు పొడగించడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ముత్యంపేట సొసైటీ చైర్మన్ నరేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు సేవా చేయడానికి ప్రభుత్వం ఆరు నెలలు పొడగించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం పదవి కాలం పొడగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సంతోషాన్ని పాలక వర్గంతో సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గం, నాయకులు, రైతులు తదితరులు పాల్గన్నారు.

## గుండెపోటుతో ప్రముఖ చిత్రకారుడి మృతి



మచ్చ రవి (ఫైల్ )

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు మచ్చ రవి శనివారం గుండెపోటు రాగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. రవికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కుమార్తె గల్ఫ్‌లో ఉండడంతో సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువుల ద్వారా తెలిసింది. ఆదివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రవి పార్థివ దేహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. టిపిసిసి అధికార ప్రతినిధి బండ శంకర్, కళాశ్రీ అధినేత గుండేటి రాజు తదితరులు రవి మృత దేహానికి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## చిత్రకారుడు రవి మృతి తీరని లోటు

జగిత్యాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చిత్రకారుడు, సాయి డిజిటల్ క్రియేటర్ మచ్చ రవి మృతి కళారంగానికి తీరని లోటని టీపీసీసీ సెక్రెటరీ బండ శంకర్, జగిత్యాల కళాశ్రీ అధినేత గుండేటి రాజు అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. సృజనాత్మక చిత్రకారుడైన రవి డిజిటల్, యూట్యూబ్ రంగంలో ఎందరినో తీర్చిదిద్దిన ఆయన మృతి చెందడం బాధకరమన్నారు. రవి మృతి పట్ల నాయకులు ఎలిగేటి రాజేంద్ర ప్రసాద్, రచయిత అల్లె మధు, మహిపాల్, గొల్లపల్లి శ్రీరాములు, ఫ్లెక్సీ ప్రింటర్స్ యజమానులు సంతాపం వ్యక్తం చేశారు.

## ఉచిత వైద్య శిబిరం

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 16( ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పన్నపేటలో కనెక్ట్ ల్యాబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఉచిత రక్తపరీక్ష శిబిరం నిర్వహించారు. అనంతరం ఆరోగ్య సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కనెక్ట్ జగిత్యాల బ్రాంచ్ మేనేజర్ ఫణిభూషన్, మార్కెటింగ్ మేనేజర్ బాబురావు, ల్యాబ్‌ఇన్‌చార్జి నరేష్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.